సమస్యల పరిష్కారానికి కృషి

- 121 గ్రావెల్ రోడ్ల కోసం రూ.10 కోట్లు మంజూరు
- బాలినేని, మాగుంట సహకారంతో 30 రోడ్లు పూర్తి



అల్లూరులో భూమి పూజ చేస్తున్న రాఘవరెడ్డి, ప్రణీత్‌రెడ్డి, నాయకులు

అల్లూరు (కొత్తపట్నం): ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ నిత్యం వారితోనే ఉంటామని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే తనయుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యుడు తనయుడు మాగుంట రాఘవరెడ్డి అన్నారు. నెల రోజుల నుంచి జరుగుతున్న గ్రావెల్ రోడ్ల పనులను వారు పరిశీలించారు. మరో గ్రావెల్ రోడ్డుకు గురువారం టెంకాయలు కొట్టి భూమి పూజలు చేశారు. ఇద్దరు పొక్లెయిన్ మీద కూర్చొని మట్టి తీసి ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో యువ నేతలు మాట్లాడుతూ గ్రావెల్ రోడ్లు పూర్తి చేయటానికి తమ వంతు సహాయ సహకారం అందిస్తామన్నారు. ఎన్ఆర్‌జీఎస్ ద్వారా గ్రావెల్ రోడ్లు వేయడానికి, 121 రోడ్లు మంజూరు కావడానికి బాలినేని శ్రీనివాసరెడ్డి కృషి చేశారని, రోడ్లు వేయటానికి ఉచితంగా పొక్లెయిన్‌ను మాగుంట శ్రీనివాసరెడ్డి అందించారని తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ ఇప్పటికే 30 రోడ్లు పూర్తి చేశామని, మిగత రోడ్లు రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. గ్రామస్తుల సహకారంతో డొంకలు, కొలతలు కొలిచి రోడ్లు వేస్తున్నామన్నారు. మరో 125 సీసీ రోడ్లకు కూడా ఎస్టిమేషన్ వేయించామని, అవి కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. టీవై కాలనీ వంతెన ఏర్పాటుకు ఎంపీ నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరయ్యాయని, టెండర్లు కూడా పూర్తియ్యాయన్నారు. మండల వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షుడు ఆళ్ల రవీంద్రరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు 70 సంవత్సరాల నుంచి వెంటాడుతుంటే మంత్రిగా ఉన్నప్పుడు బాలినేని శ్రీనివాసరెడ్డి రూ.23 కోట్లు మంజూరు చేయించి ఇప్పటికే 75 శాతం పూర్తి చేయించినట్లు చెప్పారు. 15 వేల స్తంభాలు, టవర్లు వేశారని ఘతెలిపారు. అనంతరం ప్రణీత్‌రెడ్డి, రాఘవరెడ్డిని శాలువాలతో సన్మానించారు. రాష్ట్ర మత్స్యకార వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాయల సుమతి, వీరేపల్లి రామచంద్రారెడ్డి, చీమకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు యామా శ్రీనివాసరావు, సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, సర్పంచ్‌లు, కోఆప్షన్ మెంబర్ బాజీ, ఉప సర్పంచ్ తాటిపర్తి సుబ్బారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, ఏపీవో రత్న జ్యోత్స్న, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలినేనికి రాఖీ కట్టిన కార్పొరేటర్



మాజీ మంత్రి బాలినేనికి రాఖీ కడుతున్న కార్పొరేటర్ నూకతోటి మస్తానమ్మ

చీమకుర్తి: రాఖీ పండగను పురస్కరించుకొని గురువారం పేర్నమిట్ట 42వ డివిజన్ కార్పొరేటర్ నూకతోటి మస్తానమ్మ మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లో ఉల్లాసంగా ఉత్సవాలు జరిగాయి.

వైఎస్సార్ బీమా నగదు రూ.10 వేలు అందజేత

వెలిగండ్ల: మండలంలోని కేపీ అగ్రహారం గ్రామానికి చెందిన బొప్పరాజు పిచ్చమ్మ అనారోగ్యంతో చనిపోయింది. వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష మంజూరు కాగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఎంపీడీఓ టి.సుకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు వైనాగూర్‌యాదవ్ గురువారం పిచ్చమ్మ కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జార్జి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ టి.దేవసహాయం, పీఏసీఎస్ చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు మారం వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

న్యాయ సేవలపై అవగాహన అవసరం

సీఎస్‌పురం (పామూరు): ప్రజలంతా ఉచిత న్యాయసేవలపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ న్యాయవాది మందిరెడ్డి రామసుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని చింతపూడి గ్రామ సచివాలయంలో గురువారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌జీఓ, పారాలీగల్ వలంటీర్ షేక్ నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉచిత న్యాయ సేవలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కోర్టుఫీజుకు సంబంధించి ఖర్చులు భరించడంతో పాటు జడ్జిమెంట్ నకళ్లను ఉచితంగా ఇస్తామన్నారు. సర్పంచ్ ముప్పాళ్ల వసంతరాజు, గ్రామస్తులు కుర్రా నరేష్, సచివాలయ సిబ్బంది పాల్గొని ప్రచారపత్రాలను ఆవిష్కరించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



హోమం వద్ద పూజలు చేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని కిచ్చంపల్లిలో నీలంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ట గురువారం వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, గాయంవారిపల్లి సర్పంచ్ గాయం రామక్రిష్టారెడ్డి, రైతు సంఘ అధ్యక్షుడు శ్యాల సాంబిరెడ్డి, మాజీ రైతు సంఘ అధ్యక్షుడు కుందురు నారాయణరెడ్డి, ఏలూరి శ్రీనివాసులరెడ్డి, గాయం సుబ్బారెడ్డి, శ్యాల శ్రీనివాసురెడ్డి, అన్నపురెడ్డి సుబ్బారెడ్డి పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఏపీపీగా ప్రసాద్‌రెడ్డి

కందుకూరు: కందుకూరు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుకు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది మారే ప్రసాద్‌రెడ్డి నియమితులయ్యారు. దాదాపు 3 ఏళ్ల పాటు ప్రసాద్‌రెడ్డి ఈ పదవిలో కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, ఎంపీ విజయసాయి రెడ్డి, రాష్ట్ర లీగల్‌సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, లీగల్‌సెల్ జోనల్ ఇన్‌చార్జి రాజారెడ్డి, నెల్లూరు లీగల్‌సెల్ జనరల్ సెక్రటరీ సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అల్లూరు ఇరిగేషన్ చెరువు పరిశీలన



అల్లూరు ఇరిగేషన్ చెరువును పరిశీలిస్తున్న ప్రణీత్‌రెడ్డి, రాఘవరెడ్డి

అల్లూరు (కొత్తపట్నం): అల్లూరులో ఉన్న ఇరిగేషన్ చెరువును యువనేతలు బాలినేని ప్రణీత్‌రెడ్డి, మాగుంట రాఘవరెడ్డి గురువారం పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ అల్లూరు చెరువు ఆయకట్టు ఎంత, ఎన్ని ఎకరాలు సాగుబడి చేస్తారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అల్లూరు చెరువు సుమారు 1,800 ఎకరాలు దాని ఆయకట్టు కింద రెండు వేల ఎకరాలు వరి సాగుబడి చేస్తారని చెప్పారు. చెరువులో ఉన్న చిల్లచెట్లు తీయించి శుభ్రం చేయించామన్నారు. ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి చెరువుకు వెళ్లే గ్రావెల్ రోడ్డు పరిశీలించారు. ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఆళ్ల రవీంద్రరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు పాల్గొన్నారు.

ఇ-పోస్టు ద్వారా ఇస్రోకు శుభాకాంక్షలు



ఇ- పోస్టు ద్వారా ఇస్రోశాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలుపుతున్న పేస్ ఎస్ఆర్ విద్యార్థులు

ఒంగోలు: ఇ- పోస్టు ద్వారా చంద్రయాన్- 3 విజయానికి కారణమైన ఇస్రో శాస్త్రవేత్తలకు స్థానిక పేస్ ఎస్ఆర్ విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ ఒంగోలు పార్లమెంట్ కన్వీనర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శెగ్గం శ్రీనివాసరావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి తపాలా శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ బీవీఎస్ సురేష్, పోస్టుమాస్టర్ పి.రాజేశ్వరి, కె.వినయ్‌తేజ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రయాన్ 3 విజయవంతం చేసిన శాస్త్రవేత్తలకు ఇ- పోస్టు ద్వారా శుభాకాంక్షలు తెలిపేందుకు తపాలాశాఖ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. పేస్ ఎస్ఆర్ విద్యార్థులు స్పందించడంపై వారు అభినందనలు తెలిపారు. పాఠశాల డైరెక్టర్ నాగేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

సాగులో జీవన ఎరువులు కీలకం



జీవన ఎరువుల గురించి వివరిస్తున్న ఆత్మ పీడీ

నాగులుప్పలపాడు: మిరప పంటలో నీటి ఎద్దడిని తట్టుకొని, వేరు వ్యవస్థ బాగా పెరగడానికి జీవన ఎరువులు బాగా ఉపయోగపడతాయని ఆత్మ పీడీ అన్నపూర్ణ తెలిపారు. గురువారం మండలంలోని మిరప పంట సాగు చేస్తున్న విధానంపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమం రాపర్ల, పోతవరంలో చేపట్టారు. ఆత్మ పీడీ మాట్లాడుతూ ఆత్మ ఫార్మర్ ఓరియెంటెడ్ పథకం 2023-24 కింద మిరప సాగు చేసే రైతులకు వీఏఎం జీవన ఎరువులు ఉచితంగా సాగు చేస్తామని తెలిపారు. జీవన ఎరవు 5 కిలోలు 600 కిలోల పశువుల ఎరువుతో కలిపి మిరప పంట వేసే పొలంలో వేసి మొక్క కింద పెట్టడం వలన వేరు వ్యవస్థ బాగా వృద్ధి చెందుతాయన్నారు. ఇది మొక్కలకు అవసరమైన భాస్వరాన్ని అందించడంతో నీటి ఎద్దడి, తెగుళ్ల నుంచి తట్టుకోగలుగుతాయన్నారు. కొన్ని రకాల హార్మోన్లు కూడా అందించి పంట ఎదుగుదలలో తోడ్పడతాయన్నారు. మండల వ్యవసాయధికారి వెంకట్రావు, ఉద్యానవన శాఖాధికారి ప్రత్యూష, శేషమ్మ, రైతులు పాల్గొన్నారు.

2న వైద్య శిబిరాలు

నాగులుప్పలపాడు: దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరంతో పాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి తెలిపారు. నాగులుప్పలపాడులోని ఎంపీపీ క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం 9 గంటలకు ఉచిత వైద్య శిబిరం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఒంగోలు ధానామూర్తి హార్ట్ హాస్పిటల్ వైద్యులు డా. వెంకటేశ్వరరావు, బీపీ, షుగర్, జనరల్ వైద్య నిపుణులు పాల్గొని పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం వైఎస్సార్ రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి 30 పోలీస్ యాక్ట్

ఒంగోలు సిటీ: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఒంగోలు సబ్ డివిజన్‌లో సెప్టెంబరు 1 నుంచి 30వ తేదీ వరకు 30 పోలీసు యాక్టు అమల్లో ఉంటుందని ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 పోలీసు యాక్టు ఒంగోలు సబ్ డివిజన్‌లో అమల్లో ఉన్నందున ప్రజాసంఘాలు, యూనియన్లు, రాజకీయ పార్టీలు, సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు పోలీసు అనుమతి లేనిదే నిర్వహించవద్దని డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి తెలిపారు. అలాంటి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేస్‌లో అవగాహన సదస్సు

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో వీల్స్ ఇండియా లిమిటెడ్ ఆర్అండ్‌డీ మేనేజర్ డాక్టర్ ఎం.జగన్నాథం హాజరై మెకానికల్ విద్యార్థులకు ప్రోటోటైప్ ప్రాసెస్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. ఒక ఉత్పత్తిని అభివృద్ధి చేస్తున్నప్పుడు సరళమైన విధానం నుంచి సంక్లిష్టమైన వ్యాపార భావన నిర్వహించడం, ఒక ఆలోచన నుంచి అమలుకు ప్రయాణాన్ని ఎలా నేవిగేట్ చేయాలో వివరించారు. ఉత్పత్తి, అభివృద్ధి ప్రక్రియతో ముడిపడి ఉన్న సవాళ్లను, మార్కెట్‌కు కాన్సెప్ట్‌ను తీసుకువెళ్ళడంలో అవసరమైన చర్యలను వివరించారు. కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ నూతన ఆలోచనలతో నమూనాను ఏవిధంగా అభివృద్ధి చేయాలో నేర్చుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తితో, అధ్యాపక బృందం హాజరయ్యారు.

శోభాయమానంగా విశేష స్నపన తిరుమంజనం



సప్త తిరుమంజనంలో అర్చక స్వాములు

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండమీద శ్రీగిరి వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు గురువారం పూర్ణాహుతితో వైభవంగా ముగిశాయి. పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు విశేష స్నపన తిరుమంజనం శోభాయమానంగా నిర్వహించారు. కుంభారాధన, సుదర్శనారాధన, ఉక్త హోమం, సర్వ దైవత్య హోమం, సహస్తశీతి మంత్ర హోమం, బ్రహ్మ ఘోష, యజమాన ఆశీర్వచనం, ఆచార్య శేష వస్త్ర బహుమానం కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ధర్మకర్త మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, అర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్యనిర్వహణ ధర్మకర్త సీవి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి తదితరులు పర్యవేక్షించారు. నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

డాక్యుమెంట్ రైటర్ల నిరసన

చీమకుర్తి: సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్లు గురువారం పెన్ డౌన్ సమ్మెలో భాగంగా తమ నిరసన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సేవలను ప్రభుత్వం అమలు చేస్తున్నందుకు గాను వారు నిరసన చేపట్టారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లను నిలిపివేయాలని రైటర్లు మందపాటి శ్రీనివాసరావు, మన్నం రాము, ఏలూరి శ్రీను కోరుతూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రత్యేక పూజల్లో మాగుంట రాఘవ రెడ్డి

ఒంగోలు మెట్రో: స్థానిక కేశవస్వామిపేటలోని శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామిని, కాశీ విశ్వేశ్వర స్వామి వారిని ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు రాఘవరెడ్డి గురువారం దర్శించుకున్నారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వహణాధికారి డి. రజని కుమారి, ధర్మకర్తల మండలి సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, ఈమని మదన్ మోహన్ మేళతాళలతో, మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. అర్చక స్వాములు రాఘవ రెడ్డికి వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. తాత ప్రసాద్, రామకృష్ణ అర్చక స్వాములు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జంధ్యాల పౌర్ణమి



యజ్ఞోపవీతాన్ని మార్చుకుంటున్న బ్రాహ్మణులు

ఒంగోలు మెట్రో: శ్రావణమాసం గురువారం జంధ్యాల పౌర్ణమి పండగ పర్వదినం సందర్భంగా స్థానిక అద్దేపల్లి వారి వీధి సంపత్ కుమార్ ఆర్యవైశ్య రామానుజ కూటములో ప్రముఖ వేద పండితులు నేలబొట్ల సదాశివ శివయ్య ఉదయం 8:30 లకు ముహూర్తానికి ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీరంగ క్షేత్రము నుంచి తీసుకురాబడిన యజ్ఞోపవీతములతో అత్యంత శక్తివంతమైన మంత్రం గాయత్రీ మంత్రాన్ని జపిస్తూ నూతన యజ్ఞోపవీత ధారణ చేశారు. సంప్రదాయమైన దుస్తులతో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. చుండూరు శ్రీమన్నారాయణ కార్యదర్శి చుండూరు సూర్యప్రకాశ్‌రావు, కోశాధికారి భానుప్రసాద్ పర్యవేక్షించారు.

వైస్ ప్రెసిడెంట్‌గా వెంకట రమణ



చీమకుర్తి: సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా తోకల వెంకట రమణను నియమించినట్లు గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు వి.శంకరయ్య రానున్న రెండు సంవత్సరాల కాలపరిమితితో నియమించినట్లు తెలిపారు. బీసీల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని, తనకు ఈ పదవిని ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటరు తొలగింపు దరఖాస్తుల పరిశీలన



ఓట్ల దరఖాస్తులు పరిశీలస్తున్న ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు

ఒంగోలు అర్బన్: స్థానిక 36వ డివిజన్‌లో ఓటరు తొలగింపు దరఖాస్తులను ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) విశ్వేశ్వరరావు పరిశీలించారు. గురువారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎలక్షన్ సెల్ అధికారులు, బీఎల్‌ఓలతో కలిసి ఇంటింటికీ తిరిగి తొలగింపు ఓట్లపై ఆరా తీశారు. డివిజన్‌లోని నిర్మల్ నగర్‌పార్క్ వద్ద 95,98 పోలింగ్ బూత్‌లకు సంబంధించి ఫాం 7 ఓటరు తొలగింపు దరఖాస్తులు, డబుల్ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లను ఆయా గృహస్తులతో మాట్లాడి పరిశీలించారు. వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు రాజశేఖర్, స్వరూప్, ఎలక్షన్ డీటీ రఫీ, సూపర్‌వైజర్ కె. శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై హర్షం



పరిశీలిస్తున్న గుజరాత్ టీం సభ్యులు

కొత్తపట్నం: మండలంలో రైతులు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సాగు ఎంతో బాగుందని గుజరాత్ గవర్నర్ కార్యాలయ సభ్యులు గురువారం సంతృప్తి వ్యక్తం చేశారు. రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో సాగుబడి చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని వారు పరిశీలించారు. ముందుగా పాదర్తి గ్రామంలో దద్దాల రామారావు ప్రకృతి వ్యవసాయం వనరుల కేంద్రాన్ని సందర్శించారు. టీం సభ్యులందరికీ బీజామృతం, ఘనజీవామృతం, ద్రవజీవామృతం, చేప బెల్లం ద్రావణం, బ్రహ్మాస్త్రం, విత్తన గుళికలు తయారీ విధానాన్ని ప్రకృతి వ్యవసాయం రైతులు డెమో ద్వారా చేసి చూపించారు. కొత్తపట్నంలో ఏ గ్రేడ్ మోడల్ వేసిన కోమట్ల నాంచారెడ్డి పొలంలో మోడల్ వ్యవసాయం, నాటారు ఆంజనేయులు పొలంలో వేసిన ఏటీఎం మోడల్‌ను పరిశీంచారు. తరువాత కొత్తపట్నంలో మహిళా సంఘాల సభ్యులతో ప్రకృతి వ్యవసాయం విధానం ఏ విధంగా జరుగుతుందని, ఎన్ని ఎకరాలు సాగుబడి చేస్తారు, ఏయే పంటలు వేస్తారు, ఎంత పెట్టుబడి అవుతుంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి, రీజనల్ కోఆర్డినేటర్ వెంకట్రావు, మండల వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, నరసింహులు, రెడ్డిప్ప, రైతులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: రాజా పానగల్ రోడ్డు 1వ సచివాలయాన్ని ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమయానికి డ్యూటీకి రాని వార్డు అడ్మిన్ సెక్రెటరీ, ఇతర సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. సచివాలయ సిబ్బంది మూమెంట్ రిజిస్టరును తనిఖీ చేయడమే కాక, ప్రతి ఒక్క సచివాలయ ఉద్యోగి పనిపై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టరులో నమోదు చేయాలని ఆదేశించారు. సచివాలయ పరిధిలో వసూలు చేస్తున్న ఆస్తి పన్ను, కుళాయి పన్నుల పురోగతిని గురించి సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కుళాయి పన్ను వసూలు 11.54 శాతం మాత్రమే చేశారని, అంచనాలను తప్పకుండా వసూలు చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న జేకేసీ, ఈకేవైసీలను, సీటీపీ సర్వేలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకు ముందు శానిటరీ డివిజన్ 1లో గల సత్యనారాయణపురం, బాలకృష్ణపురం, 60 అడుగుల రోడ్డు, యాదవుల బజారు, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. 48,49 డివిజన్ల కార్పొరేటర్లు, ఎంఈ, కె.మాల్యాద్రి, శానిటరీ అధికారులు, సెక్రటరీ, మేస్త్రీలు, వర్కర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.